నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com




కర్నూలు | నంద్యాల
ఆదివారం | 24 నవంబరు 2024 పేజీలు 8

# పారదర్శకంగా పోలీసుల బదిలీలు

- 143 మంది సివిల్ పోలీసులకు స్థాన చలనం


బదిలీల్లో భాగంగా సిబ్బంది సమస్యలను వింటున్న జిల్లా ఎస్పీ

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ శాఖలో ఐదేళ్ళకుపైబడి విధులు నిర్వహిస్తున్న 143 మంది పోలీస్ సిబ్బందికి నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో బదిలీలు చేశారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఖాళీలను ఆధారంగా చేసుకొని బదిలీలను చేపట్టారు. 28 మంది ఏఎస్ఐలు, 60 మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 55 మంది కానిస్టేబుళ్ళను జిల్లా ఎస్పీ వివిధ స్టేషన్లకు బదిలీ చేశారు. బదిలీల్లో ఎలాంటి సిఫారస్‌లకు తావు లేకుండా సొంత గ్రామం, మండలం, గతంలో పని చేసిన సర్కిల్ కాకుండా ఇతర సర్కిళ్ళల్లోని పోలీస్ స్టేషన్‌లలో మిగతా 2లో

## ఇంఛార్జీల పాలనలో
# ప్రజల ఇక్కట్లు ..?

- సంవత్సరాల నుంచి పెద్దకడుబూరు మండల ఎంపిడిఓ పోస్టు -2 ఖాళీ..
- ఎంపిడిఓ..తహశీల్దారు కార్యాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయండి




**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడుబూరు మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తగినంత లేకపోవడంతో పాలన కుంటుపడుటంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఇంఛార్జీల పాలనతో అనేక ఇక్కట్లు ఎదురుకుంటున్నామని అయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం పరస్తున్నారు. ముఖ్యంగా ఎంపిడిఓ కార్యాలయంలో రెగ్యులర్ ఎంపిడిఓ లేక 2 సంవత్సరాల అవుతున్న ఇంతవరకు రెగ్యులర్ ఎంపిడిఓ ను నియమించకపోవుడం విచారకరమని రెండు సంవత్సరాల నుండి ఇంఛార్జీ ఎంపిడిఓను నియమిండం వల్ల ఏలాంటి నిర్ణయాలుతీసుకోలేకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజలు వాపోతున్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో 11మంది సిబ్బంది ఉండాల్సింది ఉంది. అయితే ఎంపిడిఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ డిప్యూటేషన్ పై గోనేగండ్ల హైస్కూల్ కు వెళ్లి పోవుడంతో ఇక్కడ జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఎర్పడింది. అలాగే ఒక టైపిస్టు,ఇద్దరు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంపిడిఓ, ఎఓ,మిగిలిన సిబ్బంది ఇక్కడ తమ విధులను నిర్వహిస్తున్నారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో మిగతా 2లో



- భక్తి శ్రద్ధలతో శ్రీగిరిపై కార్తీక దీపారాధన
- వైభవంగా కొనసాగుతున్న కార్తీక మాసోత్సవాలు
- క్షేత్రంలో ఆది,సోమవారం పెరగనున్న భక్తుల రద్దీ

**శ్రీశైలం,మేజర్‌న్యూస్:** ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశశక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల మహా క్షేత్రం కార్తీక శోభతో శోభిల్లుతోంది. కార్తీక మాసం నాలుగోవ శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు శ్రీగిరిపై ఎంతో భక్తి శ్రద్ధలతో దీపారాధన చేసుకున్నారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి కృష్ణా నదిలో దీపాలను వెలిగించటంతోపాటు దేవస్థానం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాఢవీధిలో దీపారాధన చేశారు. పలువురు భక్తులు లక్షదీపాలను వెలిగించి,భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తులకు ఎలాంటి మిగతా 2లో




# శ్రీశైల క్షేత్రం..కార్తీకం శోభితం



## కాశింతల క్షేత్రంలో
# కార్తీక సోమవారానికి భారీ ఏర్పాట్లు


కాశింతల క్షేత్రంలోని ఆలయం

క్షేత్రంలోని కాశీ విశ్వేశ్వర స్వామి

- ఈనెల 25న కార్తీక కడ సోమవారం పూజలు
- సుమారు లక్ష మందికి అన్నదానం
- ఇంజేటిరంగేశ్వర రెడ్డి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో పకుళానది ఒడ్డున వెలసినకాశింతల క్షేత్రంలోని కాశీవిశ్వేశ్వర స్వామి కాశీకి ప్రతిరూపముగా కోరిన కోరికలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి కెక్కారు. క్షేత్రం ఎదుట వకుళనది గలగల పారుతుండగా భక్తులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ స్వామిని దర్శించుకుంటున్నారు. మిగతా 2లో

# ఐకమత్యంతోనే బీసీల అభివృద్ధి

- ఘనంగా బీసీ శంఖారావం వనభోజనం


మాట్లాడుతున్న మంత్రి సవితమ్మ

**కర్నూలు కల్చలర్, మేజర్‌న్యూస్:** బీసీలు ఐక్యమత్యంగా ఉంటేనే అభివృద్ధి చెందుతారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ మిగతా 2లో


ర్యాలీనిర్వహిస్తున్న దృశ్యం

# పారదర్శకంగా పోలీసుల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఖాళీలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపి పోలీస్ స్టేషన్లను ఎంచుకునే అవకాశం ఇచ్చారు. సిబ్బందితో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి వ్యక్తిగత సమస్యలు, పిల్లల చదువులు, కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలు, స్పౌజ్ కోటకు ప్రాధాన్యత కల్పించి బదిలీలను భర్తీ చేశారు. పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా వ్యవహరించి జిల్లా ఎస్పీ బదిలీలు చేపట్టారని సిబ్బంది సంతృప్తిని వ్యక్త పరిచారు. బదిలీల్లో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, డీఎస్పీలు రామాంజినాయక్, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, శ్రీనివాస్, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైల క్షేత్రం..కార్తీక శోభితం

(మొదటి పేజీ తరువాయి)

అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో చంద్రశేఖర ఆజాద్ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ తగు చర్యలు చేపడుతున్నారు.రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటున్నారు.ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది.

**ఆకాశదీపం ఏర్పాటు :** కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆకాశదీపాన్ని వెలిగించారు.ఆలయ ధ్వజస్తంభానికిపై భాగంలో ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేశారు.ధ్వజస్తంభం వద్ద కార్తీక మాసం ముగింపు వరకు ఈ దీపాన్ని వెలిగిస్తారు.ఈ ఆకాశదీపాన్ని వెలిగించినా, చూసినా సకల పాపాలు నశించి అనంత పుణ్యం లభిస్తుందని, వ్యాధులు తొలగి ఆయురారోగ్యాలు చేకూరతాయని ప్రతీతి.

**అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు :** కార్తీకమాసోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు ధార్మిక,సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది.ఇందులో భాగంగా ప్రతిరోజు సాంప్రదాయ నృత్యం,కూచిపూడి నృత్యం,భజన,ప్రవచనాల వంటి కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ బనగానపల్లె పట్టనం తెలుగు పేటకు చెందిన ఎద్దుల సుశీలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వార మంజూరైన 23,800 చెక్కును శనివారంనాడు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం సరిగా లేక ఇబ్బందులు పడి చికిత్స చేయించుకునే వారికి ఆదుకోవాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వార అండగా నిలుస్తుందని బి.సి ఇందిరమ్మ తెలిపారు.

# ఐక్యమత్యంతోనే బీసీల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

శ్యామ్‌కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. శనివారం నగరంలో బీసీ శంఖారావం వనభోజన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని రాష్ట్ర గెస్ట్ హౌస్ నుంచి నందికొట్కూరు రోడ్డులోని ఆదర్శ విద్యా జూనియర్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలు ఏకం కావాలన్నారు. ఐక్యమత్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చన్నారు. బీసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నూకాలమ్మ, నక్కలమిట్ట శ్రీనివాసులు, మురళీ మనోహర్, రాంబాబు, రామక్రిష్ణ, వెంకట్, ప్రముఖులు, పెద్ద ఎత్తున బీసీలు పాల్గొన్నారు.

# 18ఏళ్లు నిండిన యువత ఓటును నమోదు చేసుకోవాలి

**– ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం**
**– జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాష**

**కర్నూలు, మేజర్‌న్యూస్(ప్రతినిధి):** 18ఏళ్లు నిండిన యువత ఓటును నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష అన్నారు. శనివారం స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా కర్నూలు అర్బన్ పరిధిలోని స్థానిక ఎస్టీబీసీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఫారం-6, 7, 8 ఇప్పటి వరకు ఎన్ని వచ్చాయి, శాశ్వతంగా మార్పు అయ్యే ఓటర్లను ఏ ఫామ్ ద్వారా వారిని బదిలీ చేస్తారు? అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల తొలగింపులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలుఅర్బన్‌తహసీల్దార్‌వెంకటలక్ష్మి,ఎస్టీబీసీ కళాశాలప్రిన్సిపాల్‌ప్రశాంతిసామ్ పాల్గొన్నారు.



# ఇంఛార్జీల పాలనలో ప్రజల ఇక్కట్లు ..?

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిడిఓ కార్యాలయంలో పనులు కుంటు పడుతున్నాయని జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఎంపిడిఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మండలంలో 20 గ్రామ పంచాయతీలలో పెద్దకడుబూరు, హెచ్ మురువణి, కల్లుకుంట, బసలదొడ్డి, తారా పురం, బాపులదొడ్డి గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని కూడా వెంటనే ప్రభుత్వం జోక్యం కల్పించుకొని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.అదేవిధంగా స్థానిక మండల తహశీల్దారు కార్యాలయంలో కూడా 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అందులో సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఒకటి. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్.ఒక నైట్ వాచ్ మెన్ ఒక అటెండర్ పోస్టు ఖాళీగా ఉండడంతో అటు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఇటు ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు సమాచారం. ఏదైనా సమస్యలు మీద ప్రజలు తహశీల్దారు కార్యాల యానికి వచ్చిన ఇక్కడ ఎంఆర్ఐ. రీసర్వే డిప్యూటీ తహశీల్దారు లేక పోవడంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు అనేక ఇక్కట్లుకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు బాధితులు వాపోతున్నారు.. ఇప్పటికైనా జిల్లా మంత్రులు, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ఎంపిడిఓ. తహశీల్దారు కార్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రజల పనులను సత్వరమే చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కాశింతల క్షేత్రంలో కార్తీక సోమవారానికి భారీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)



ప్రతి ఏటా కార్తీక కడ సోమవారం రోజున భక్తులతో క్షేత్రం పోటెత్తుతున్నది. ఆలయానికి ఎదురుగా ఉండే వనంలో గత 32సంవత్సరాలుగా అన్న ప్రసాద వితరణ చేసున్నారు. భారీగా తరలివచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ ఆధ్వర్యంలో అర్బన్ సీఐ చిరంజీవి, ఎస్సైలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల కొరకు ప్రత్యేక ఏర్పాట్లు లక్ష మందికి అన్నదానం: నిర్వాహకులు ఇంజేటి రంగేశ్వర రెడ్డి కార్తీక కడ సోమవారం సందర్భంగా క్షేత్రానికి ఎదురుగా ఉన్న వనంలో ఈనెల 25న వనభోజనానికి హాజరయ్యే భక్తుల కొరకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు మహాలక్ష్మి సంస్థల అధినేత ఇంజేటి రంగేశ్వర్‌రెడ్డి తెలిపారు. సుమారు లక్ష మందిభక్తులకుఅన్నప్రసాదాన్ని అందించాలని నిర్ణయించామన్నారు. గత 32 సంవత్సరాల నుంచి భగవంతుడు భక్తులకు అన్నప్రసాదాన్ని అందించే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. భక్తులందరూ కాశీ విశ్వేశ్వర స్వామి దర్శించి ఎదురుగా ఉన్న వనములో అన్నప్రసాదాన్ని స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు.రవాణా సౌకర్యాలు లేని రోజుల్లో కాశీకి పోతే తిరిగి రావడం కష్టమని చెప్పుకొచ్చేవారు. ఇందులో భాగంగా ఒక ఋషి పుంగవుడు కాశి నుంచి కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహాన్ని తీసుకొని దక్షిణాది రాష్ట్రాల వైపు బయలుదేరారు. చీకటి పడడంతో ఒకచోట రాత్రి ఆ విగ్రహాన్ని చెలిమ లాంటి గుంతలో పాతి నిద్రించారు. వేకువ జామున విగ్రహాన్ని తీసేందుకు ప్రయత్నించగా నలువైపులా కదలడం తప్పితే విగ్రహం పైకి రాకపోవడంతో తిరిగి ఆయన నిద్రించారు. ఋషి పుంగవుడికి స్వామి కలలోకి వచ్చి నాయనా ఆ విగ్రహాన్ని ఇక్కడే వదిలేసి వెళ్ళుని చెప్పారు. అప్పుడు ఆయన అలా అయితే పూజా కైంకర్యముల పరిస్థితి ఏమిటి స్వామి అని అడిగారు. కొద్ది దూరం వెళ్లి అక్కడ తాను ఆగుతానని స్వామితెలియజేశారు. తదనంతరం కొంతకాలం తర్వాత భారీ వర్షానికి ఆ విగ్రహం కొట్టుకొని వచ్చి ఆళ్లగడ్డ సమీపంలోని వకులా నదిమధ్యలో ఆగిపోయింది. గుర్తించిన ప్రజలు నదీ ప్రవాహానికి పశ్చిమ ముఖంగా దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం జనమే జయ మహారాజు హయంలో నిర్మించినట్లు చెబుతున్నారు. ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందింది. 1996లో వరద ప్రవాహానికి ఆలయంలోనికి నీరు చేరి భక్తులకు ఇబ్బందిగా మారడంతో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. కాశీ నుంచి కొట్టుకొచ్చిన విగ్రహం కావడంతో ఇది కాశింతల క్షేత్రంగా ఖ్యాతిగాంచింది. ఇందులో భాగంగా పాత విగ్రహం అలాగే ఉంచి ఆలయంలో మరో కొత్త విగ్రహాన్ని ప్రతిష్టించారు. నాటి నుంచి దేవాలయం అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఆలయానికి సిమెంట్ రోడ్డుతో పాటు నవగ్రహాలు, ఆంజనేయ స్వాముల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇటీవల దక్షిణామూర్తి స్వామిని ప్రతిష్టించారు. యేటికి అవతల కాశిరెడ్డి నాయన, గంగమ్మ దేవాలయాలు ఉన్నాయి. ఆలయం ఎదురుగా అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణంలో ఉంది. కార్తీక సోమవారం కాశి విశ్వేశ్వర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో సందర్శిస్తున్నారు. నదిలో స్నానం చేసి దీపం వదిలి స్వామిని పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం, స్వామికి చెంబు నీరు పోసిన పుణ్యం వస్తుందని నమ్మకంతో సోమవారం కార్తీక మాసంలో ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఆలయ కమిటీ వారు ఆలయానికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నారు. కార్తీక మాసం కడ సోమవారంరోజున ఆలయానికి ఎదురుగా వనములో భక్తులకు భారీగా అన్న ప్రసాదాన్ని అందిస్తున్నారు. కార్తీక మాసంలో కడ సోమవారం భక్తులు స్వామిని దర్శించి కోరికలు సిద్ధించుకోవాలని అర్చకులు సూచిస్తున్నారు.

# నాగరకన్విలో రీ సర్వే రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

**★ ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**

**హొళగుంద,మేజర్‌న్యూస్:** హొళగుంద మండలం హొన్నూర్ గ్రామ పంచాయితీ పరధిలోని నాగరకన్విలో రీ సర్వేపై రైతులు ఇచ్చిన ఆర్జీలను పరిష్కరిస్తామనిఆదోనిసబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం సందర్శించిన ఆయన గ్రామంలో గతంలో జరిగిన రీ సర్వే సక్రమంగా జరగలేదన్న రైతులు సబ్ కలెక్టర్‌కు ఆర్జీలను సమర్పించారు.వీటిని పరిశీలించి పరిష్కారం చేస్తామని రైతులకు తెలియజేశారు.అదేవిధంగా మండలంలోని సుళువాయి,హొళగుంద గ్రామాల్లో ల్యాండ్ కన్వర్షన్‌పై సర్వే నెంబర్లను తనిఖీ చేశారు.తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్,విఆర్ఒలతో మాట్లాడారు.విఆర్ఒలు బాధ్యతగా పని చేయాలని చెప్పారు.ఆయన వెంట తహశీల్దార్ సతీశ్‌కుమార్, విఆర్ఒలు నాగరాజు,తిప్పన్న,సురాంజనేయులు,సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.



# హెచ్ఎంపై విచారణ చేపట్టాలి

**– కర్నూలు డీఈవో శామ్యూల్‌పాల్‌కు వినతిపత్రం అందజేత**

**నంద్యాలఅర్బన్, మేజర్‌న్యూస్ :**నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం రేవనూరు హైస్కూల్ నందు విధులు నిర్వహిస్తున్న బీటీఎఫ్, హిందీ టీచర్ సతీష్‌కుమార్‌పై ఎటువంటి విచారణ లేకుండా తప్పుడు రికార్డులు సృష్టించిన హెచ్ఎం రామచంద్రారెడ్డి అప్పటి కర్నూలు జిల్లా డీఈవో రంగారెడ్డికి సహకరించి తనను సస్పెండ్ చేసినట్లు సతీష్‌కుమార్ ఆరోపించారు. కొందరి నుంచి అడ్రస్‌లు లేని ఫిర్యాదులను స్వీకరించి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కక్షపూరితంగా, ఏలాంటి విచారణ చేయకుండా అక్రమంగా సస్పెండ్ చేశారని అన్నారు. ఈ సందర్భంగా కర్నూలు డీఈవో శామ్యూల్‌పాల్‌కి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఆర్జేడీ ఉత్తర్వుల మేరకు తక్షణమే విచారణ చేపట్టాలని శామ్యూల్‌పాల్ కోరినట్లు ఆయన తెలిపారు.



కర్నూలు డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సతీష్‌కుమార్

# ఓటు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన తహశీల్దార్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** శ్రీశైల నియోజకవర్గ కేంద్రం ఆత్మకూరు మండలంలోని పోలింగ్ బూతుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని తహశీల్దార్ రత్నరాధిక పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం చేపట్టిన ఓటు నమోదు కార్యక్రమాన్ని పర్యావేక్షించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఓటు నమోదు ఏ విధంగా చేస్తున్నారు. ఏ పోలింగ్ బూతులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి తదితర అంశాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఓటు నమోదు, సవరణ కార్యక్రమంపై పోలింగ్ బూతు పరిధిలో ప్రతి ఒక్కరికి తెలియజేయాలని , వచ్చిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఓటు నమోదు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తు దారులకు నాణ్యమైన సేవలందిస్తు ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకొనేలా బిఎల్‌ఓలు చొరవ తీసుకోవాలన్నారు. ఈప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని, ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



పోలింగ్ బూతుల్లో ఓటు నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేసిన తహశీల్దార్

# బీజేపీతోనే దేశాభివృద్ధి

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** బీజేపీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో అద్భుతమైన ఘనవిజయాన్ని సాధించిన (మహాయుతి) కూటమి సందర్భంగా శనివారం బీజేపీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో దేశాభివృద్ధికి బీజేపీ అవసరమని తేలిపోయిందన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.




సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

## జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఆట వస్తువులను అందజేసిన

# ఆల్ట్రాటెక్ పరిశ్రమ



స్పోర్ట్స్ కిట్‌ను అందజేస్తున్న ఆల్ట్రాటెక్ పరిశ్రమ

**కొలిమిగుండ్ల, మేజర్‌న్యూస్:** మండలంలోని అంకిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఆల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ యూనిట్ హెడ్ జె.ఎ సజేంద్ర కుమార్, హెచ్.ఆర్.జె రంగ్ కుమార్, హెచ్.ఎం పద్మజ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు రూ. 90వేలు విలువ గల స్పోర్ట్స్ మెటీరియల్స్ విద్యార్థులకు టీషర్ట్స్, క్రికెట్ బ్యాట్లు, కిట్ చదరంగం, క్యారంబోర్డు , వాలీబాల్ తదితర ఆట వస్తువులు అందజేయడంతో పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెదేపా సభ్యత్వంతో జీవితానికి భరోసా

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు 113 బూతు గండిపేట, మంచినీళ్ళ బావి వీధుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టణ అధ్యక్షులు ఖలీలుల్లాఖాన్, మైనార్టీ నాయకులు ఇదాయత్ ఆలీఖాన్, ఇంతియాజ్‌లు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం రూ.100తో నమోదు చేసుకుంటే రూ.5 లక్షల ప్రమాద భీమాతో పాటు మట్టి ఖర్చుల నిమత్తం రూ.10 వేలు కల్పిస్తారని తెలిపారు. విద్య, వైద్య, ఉపాధిలోనూ సహాయం అందుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియజేస్తున్నామని వారు అన్నారు. టీడీపీ కార్యకర్తలందరూ పార్టీ సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రహీమాన్, ఆంజనేయులు, రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు దృశ్యం

# ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధికి కృషి చేయండి

## - కుడా ఛైర్మెన్‌కు శుభాకాంక్షలు తెలిసిన జేఏసీ నేతలు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ఉమ్మడి కర్నూలు జిల్లాను అభివృద్ధి చేయాలని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నూతన చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లును రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బి.శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతన చైర్మన్‌గా నియమితులైన సోమిశెట్టి వెంకటేశ్వర్లును రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ, ఎప్పటికపుపడు స్పందించే వ్యక్తి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. కుడా చైర్మన్‌గా ఆయనను నియమించడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న, చందు, నాగరాజు, లక్ష్మణ్, తిరుపాల్ పాల్గొన్నారు.




కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సన్మానిస్తున్న దృశ్యం

# సాయి విజేయుడి మృతి పార్టీకి తీరనిలోటు

## - ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీకి చెందిన చాపల సాయి విజేయుడు మృతి చెందడం తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు అని నందికోట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. శనివారం పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో టీడీపీకి చెందిన సాయి విజేయుడు గుండె పోటుతో మరణించాడని తెలుసుకొని ఎమ్మెల్యే గ్రామానికి వెళ్ళి సాయి పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలుపుతూ అధైర్య పడవద్దు అని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అలాగే నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జీ మాండ్ర శివానందరెడ్డి మృతుడు సాయి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి పార్టీ సాయి సేవలను మరువదని, మీ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, లోకానందరెడ్డి, రామిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, శివారెడ్డి, చాకలి రామస్వామి, జున్ను రామిరెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజు, శివ, శ్రీను, గౌండ మాబాష, తదితరులు ఉన్నారు.



సాయి విజేయుడి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

# బైక్ దొంగ అరెస్టు

## - 13బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం



దొంగను అరెస్టు చూపిస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు, నంద్యాల జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, 3వ పట్టణ సీఐ శేషయ్య తెలిపారు. శనివారం నగరంలోని 3వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కేసు వివరాలను వివరించారు. 2024లో పలు ప్రాంతాల్లో మొత్తం 13బైక్‌లు, ఒక ఆటో చోరీకి గురయ్యాయని కేసులు నమోదయ్యాయి. వీటిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టామన్నారు. ఇదిలా ఉండగా శనివారం నంద్యాల చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా డోన్‌కు చెందిన నాగుల వినయ్‌కుమార్ పోలీసులను చూసి బైక్‌పై పారిపోతుండగా అనుమానం వచ్చిన పోలీసులు అతని వ్యక్తిని పట్టుకొని విచారణ చేశారు. పోలీసుల విచారణలో వినయ్‌కుమార్ తాను బైక్‌ల దొంగతనానికి పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతను వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టి 13బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.9.10లక్షలు ఉంటాయని తెలిపారు. వినయ్‌కుమార్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## ఘనంగా మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

# జన్మదిన వేడుకలు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంతిర కేఈ ప్రభాకర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కేఈ ప్రభాకర్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నంద్యాల నాగేంద్ర, షేక్‌ముంతాజ్, కేఈ జగదీష్, పరమేష్, జేమ్స్, బషీర్, సోమిశెట్టి నవీన్, పేరపోగు రాజు, అబ్బాస్, ఎల్‌వి.ప్రసాద్, ఆదాం, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న కేఈ ప్రభాకర్

# ప్రత్యేక ఓటరు నమోదుకు 32 దరఖాస్తులు



ఓటరు కేంద్రాన్ని పరిశీలించిన డి.టి

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్:** మండలంలో శనివారం ఏరాపటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల్లో 32 దరఖాస్తులు అందినట్లు డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్ బాబు తెలిపారు. కొత్త ఓటరు నమోదుకు 18, మార్పు చేర్పులకు 2, సవరణల కోసం 12 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. మండలంలోని బూత్‌లెవెల్ అధికారు లందరూ వారికి కేటాయించిన కేంద్రాల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

సూర్య



నాణ్యమైన మద్యం అందించేందుకు

# అధునాతన టెస్టింగ్ యంత్రాల ఏర్పాటు

– జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఆధునాతన యంత్రాల ద్వారా పరీక్షల నిర్వహించి నాణ్యమైన మద్యాన్ని అందించేలా చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష పేర్కొన్నారు. శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాంప్లెక్స్‌లో ఉన్న రీజనల్ ఎక్సైజ్ ల్యాబోరేటరి కలెక్టర్ సందర్శించారు. కొత్తగా వచ్చి పరికరాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు డిస్టిలరీస్లో తయారయ్యే మద్యం నాణ్యతను, పరిమాణాన్ని పరిశీలించేందుకు ప్రభుత్వం కొత్తగా యంత్రాలను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం కలెక్టర్ సహాయ కమీషర్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, కెమికల్ ఎగ్జామినర్ హరిత, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి





**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** పోలీస్ సిబ్బంది విధుల్లో నిత్యం అప్రమత్తంగా ఉండాలని కర్నూలు డిఎస్పి జె బాబుప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను శనివారం డిఎస్పి తనిఖీ చేశారు. కర్నూల్ రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు,ఎస్ఐ సునీల్ కుమార్ డి.ఎస్.పి కి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పై ని స్టేషన్ కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని సీసీ కెమెరాలు, సిబ్బంది పనితీరుతో పాటు పెండింగ్ ఫైల్స్, కేసుల స్థితిగతులపై రికార్డులతో పాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంతోపాటు శాంతిభద్రతలపై తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల్లో భద్రతాభావాన్నిపెంపొందించాలన్నారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య పంట పామాయిల్ పంట

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మాధవరం గ్రామంలో ఆయిల్ ఫాం పంటను ఉద్యానవన శాఖ అధికారి చందన రైతులతో కలిసి పరిశీలించారు. తదనంతరం ఆమె మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగు ఎంతో లాభదాయకమని, పంటను ఆశించే పురుగులు, తెగుళ్ళు చాలా తక్కువ అని, 4వ సంవత్సరం నుంచి దుగుబడులను ఆశించవచ్చునని, ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.13,652 ఉందని, ఆయిల్ ఫాం స్కీమ్ కింద హెక్టారుకు సబ్సిడీ ధర రూ.11,500 ఉందని తెలిపారు. పతాంజలి కంపెనీ వారు మొక్కలను ఉచితంగా ఇస్తారని, వాటికి వచ్చే గెలలను కంపెనీ వారే కొనుగోలు చేస్తారని తెలిపారు. ఎకరాకు 57 మొక్కలు నాటుకోవాలని, ఎకరానికి 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. మిరప పంటలో కూడా ఇంటిగ్రేటెడ్ న్యూట్రీషియన్ మేనేజ్‌మెంట్ పథకం కింద రైతులకు రూ.2400 జిగురు అట్ట ముక్కలను, వేప నూనెను అందిస్తున్నామని, రూ.1200 రైతులకు సబ్సిడీ వస్తుందని తెలిపారు. మిరప రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.



రైతుతో ఉద్యానవన శాఖ అధికారి చందన

## శీతకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** శీతకాలంలో చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డీఈఎంఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం నగరంలోని ఇందిరమ్మ కాలనీ యూపీహెచ్‌సీలో న్యుమోనియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతకాలంలో న్యుమోనియా ఎక్కువ వ్యాప్తి చెంది అవకాశం కావునా తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వాలన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త సత్యకల, ఆశా కార్యకర్తలు జాకీరబేగం, తబిత పాల్గొన్నారు.

# చదువు ఎంతో విలువైనది

– పునాది చదువు బలంగా ఉండాలి

– భగవద్గీత భవిష్యత్తు దారి చూపుతుంది: సినీహీరో తల్వార్ సుమన్





బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** మనిషి ఉన్నతికి చదువుతో ఉపయోగపడుతుందని, పునాది చదువు బలంగా ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించడం పెద్ద కష్టం కాదని సినీహీరో తల్వార్ సుమన్ అన్నారు. క్లస్టర్ విశ్వవిద్యాలయంలో యువతరంగ్-2024 ఇంటర్ కళాశాల క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానోత్సవం శనివారం క్లస్టర్ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత ఒక మత గ్రంథం కాదని, మనిషి కష్ట సమయంలో ఉన్నప్పుడు గీతను చదివినా, విన్నా సమాధానం దొరుకుతుందన్నారు. తల్లిదండ్రులు, గురువులు విద్యార్థి జీవితంలో ముఖ్యమైనవారన్నారు. యువతరం దేశ ఉన్నతికి కృషి చేయాలన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. క్లస్టర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డివిఆర్.సాయిగోపాల్ మాట్లాడుతూ సమాజంలో సమస్యలు లేని వ్యక్తి అంటూ ఉండదని, వాటిని ఎదుర్కొని విజయం సాధించినప్పుడే మన శక్తి ఏమిటో నిరూపితమవుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఒక లక్ష్యాన్ని పెట్టుకొని దాన్ని చేరుకోవాలంటే సమయ పాలన ముఖ్యమన్నారు. ముందుగా ఎన్‌సీసీ విద్యార్థులు అతిధులు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్.బాష, డాక్టర్ పార్వతిదేవి, వింధ్యవాసిని, శ్రీనివాసరెడ్డి, అక్తర్‌భాను, మహమ్మద్‌వాయిద్, ఎల్లక్రిష్ణ, సోమశేఖర్, పార్వతి, అనూష, సినీ గాయకుడు కరిముల్లా పాల్గొన్నారు.

# జుర్రేరు వంతెన పనులు మంత్రి బి.సి పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** బనగానపల్లె పట్టణంలోని జుర్రేరు వంతెన పనులను రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌళిక సదుపాయల శాఖా మంత్రిని బి.సి జనార్ధన్ రెడ్డి శనివారం పరిశీలించారు. బనగానపల్లె పాత బస్టాండు వద్ద జుర్రేరు వద్ద మరమ్మత్తు పనులను ఇటీవల చేపట్టడం జరిగింది. జుర్రేరు వంతెన పనులు జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని వంతెన మరమ్మత్తులను వేగవంతం చేయాలని వారికి సూచించడం జరిగింది.

డిసెంబర్ 7న

## సాయుధ దళాల పతాకావిష్కరణ

– గుడ్‌షెప్పర్డ్ పాఠశాల కరస్పాండెంట్‌కు ప్రశంసాపత్రం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** డిసెంబర్ 7వ తేదీన సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని సాయుధ దళాల పతాక స్టిక్కర్స్, కార్ ఫ్లాగ్స్‌లను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆవిష్కరించారు. ఈసందర్భంగా గత సంవత్సరం 2023 సాయుధ దళాల పతాక దినోత్సవానికి అధికంగా రూ.4లక్షల 12వేలు విరాళాలు అందించిన నంద్యాల గుడ్‌షెప్పర్డ్ పాఠశాల ప్రిన్సిపల్ జెస్సిపాల్ తరపున పాఠశాల కరస్పాండెంట్ శామ్యుల్‌ను ప్రశంసా పత్రం అందజేశారు.



గుడ్‌షెప్పర్డ్ పాఠశాల తరపున వచ్చిన శ్యాముల్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి



పెద్ద చైనాను పరామర్శిస్తున్న దృశ్యం

పెద్ద చైనాను

## బి.సి రాజారెడ్డి పరామర్శ

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** బనగానపల్లె పట్టణానికి చెందిన బి.సి కుటుంబ వీరాభిమాని పెద్ద చైనాను మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి పరామర్శించారు. ఇటీవల పెద్ద చైనా అనారోగ్యంతో బాధ పడుతూ నంద్యాలలోని ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న బి.సి రాజారెడ్డి వారి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అలాగే ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించాలని ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందేలా చూస్తానని తెలిపారు.

అంచనాల కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన

# ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియకు అభినందనలు



అఖిలప్రియ

**దొర్నిపాడు, మేజర్‌న్యూస్ :** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శుక్రవారం జరిగిన అసెంబ్లీ కమిటీల ఎన్నికల్లో అందరి అంచనాలను అధికమిస్తూ రాష్ట్ర అంచనాల కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన సందర్భంగా మండలంలోని కొండాపురం గ్రామ టీడీపీ యువత చవ్వా శివారెడ్డి, పైడెల పవన్ రెడ్డిలు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంచనాల కమిటీ సభ్యురాలిగా ఎంపిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంచనాల కమిటీ మెంబర్‌గా ఎన్నికైన అఖిలప్రియకు అరుదైన గౌరవం దక్కినందుకు వారు ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించి ఆళ్లగడ్డ నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని వారు కోరుకున్నట్లు తెలిపారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకుడు భార్గవరామ్ నాయుడు, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కొండాపురం టీడీపీ గ్రామ యువత పైడెల పవన్ రెడ్డి, చవ్వా శివారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ యువనాయకుడు చవ్వా శివారెడ్డి, టీడీపీ యువ నాయకులు పైడెల పవన్ రెడ్డి

# అగ్ని ప్రమాద కుటుంబానికి అండగా రెడ్ క్రాస్

## వంట సామాగ్రి అందజేత



బాధిత కుటుంబానికి వంట సామాగ్రి అందిస్తున్న తహసీల్దారు,రెడ్ క్రాస్ సభ్యులు

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** శుక్రవారం జి సి పాలెం గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఆంజనేయుడు కుటుంబానికి మండల రెడ్ క్రాస్ సభ్యులు అండగా నిలిచారు. ఆర్ఎంపి వైద్యుడు శ్రీనివాసులు ఆధర్వంలో బండి ఆత్మకూరు తహసీల్దారు ధోని ఆల్ఫ్రెడ్ బాధిత కుటుంబానికి తర్పల్ పట్టా,కిచెన్ సెట్ తో పాటు వంట సామాగ్రి,బియ్యం అందజేశారు.నంద్యాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,మండల సభ్యులతో కలిసి బాధిత కుటుంబాలను ఆదుకుంటాం అని అన్నారు.రెడ్ క్రాస్ సభ్యులు ముందుకు వచ్చి బాధిత కుటుంబాలకు చేయుతానందినచడం ఆనందించగలిగిన విషయమని తహసిల్దార్ ధోని ఆల్ఫ్రెడ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ ఈశ్వర్,రెడ్ క్రాస్ సభ్యులు మోహన్,వెంకటేష్, భరత్,నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### బెల్లే గుండు ఆంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధికి

# రూ.నాలుగు లక్షల విరాళం

### విరాళం అందించిన సోడాల వెంకటరాముడు కుటుంబసభ్యులు

### దాతలను సన్మానించిన ఆంజనేయస్వామి దేవాలయం కమిటీ సభ్యులు



బెల్లేగుండు ఆంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధి కి విరాళం అందిస్తున్న సోడాల వెంకటరాముడు కుటుంబసభ్యులు

**ఆలూరు, మేజర్‌న్యూస్:** ఆలూరుకు సమీపంలో వెలసిన మహిమాన్విత శ్రీ బెల్లెగుండు ఆంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధి కి పట్టణానికి చెందిన సోడాల వెంకట రాముడు వారి భార్య గోవిందమ్మ మరియు కుమార్తె దలవాయి శ్రీదేవి,అల్లుడు వీరాంజినేయులు ఆంజనేయ స్వామి దేవాలయం, 80 అడుగుల విగ్రహ ఏర్పాటుకు నాలుగు లక్షల రూపాయల భారీ మొత్తాన్ని కమిటీ సభ్యులు కు విరాళంగా అందించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారికి శాలువా కప్పి పూలమాలతో సన్మానం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ సోడాల వెంకట రాముడు కుటుంబం పై స్వామివారి కృపాకటాక్షములు ఎల్లవేళలా ఉండాలని సేవా తత్పరత,భక్తి భావం కలిగిన వారి కుటుంబానికి హనుమాన్ ఆశీస్సులు ఉంటాయని తెలిపారు.శ్రీరాముని కి ఎలా కష్ట నష్టాల్లో అండగా ఉన్నాడో హనుమాన్ వెంకట రాముడు కుటుంబానికి అలా అండగా ఉంటారని దేవుడిని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయం కమిటి సభ్యులు బిఎన్ ఆర్ రాఘవేంద్ర రెడ్డి, కాంట్రాక్టర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై దిలిప్ కుమార్

**ఆలూరు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గ కేంద్రమైన ఆలూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళల పట్ల ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలు,చట్టాలు మరియు మాదక ద్రవ్యాలు,ఇతర మత్తు పదార్థాలు వాటి వల్ల కలిగే అనర్థాలు గురించి విద్యార్థినులకు ఎస్సై దిలీప్ కుమార్ అవగాహన కల్పించారు. శనివారం ఆలూరులో బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాలికలు బాల్యంలో ఎటువంటి ఆకర్షణలకు లోనుకాకుండా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అలాగే మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ సంక్షేమ పథకాల

# గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్విని యోగం చేసుకొని అభివృద్ధి చెందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి లీలా వెంకట శేషాద్రి అన్నారు. మండల పరిధిలోని గుడుంబాయి తాండ గ్రామంలో శనివారం గిరిజన ప్రజలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడుతూ గ్రామంలోని గిరిజన ప్రజలకు అవసరమైన న్యాయసహాయాన్ని ఉచితంగా అందిస్తామని మహిళలకు న్యాయసహాయ సేవలు అందించడమే న్యాయ సేవాధికార సంస్థ ఉద్దేశమని, మహిళా చట్టాలు, లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందుటకు మీరంతా అర్హులని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సునీల్ కుమార్ గుడుంబాయి తండా గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే విరుపాక్షి ప్రత్యేక పూజలు



శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయం నందు ఎమ్మెల్యే విరుపాక్షి దంపతులు

**చిప్పగిరి, మేజర్‌న్యూస్ :** ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి కుటుంబ సభ్యులు తో కలిసి శ్రీశైల భ్రమరాంబిక,మల్లికార్జున స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.అయ్యప్ప మాల ధరించిన ఎమ్మెల్యే విరుపాక్షి భార్య రామాంజినమ్మ,కుటుంబ సభ్యులతో శ్రీశైల మల్లన్న సన్నిధిలో గడిపి స్వామి వారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం అభివృద్ధి కి కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వాలని శ్రీశైల మల్లన్న ను వేడుకున్నట్లు తెలిపారు. రైతులకు వైసీపీ ప్రభ్యత్వంలో అందిస్తున్న రైతు భరోసా ను కొనసాగించాలని దేవాలయాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా స్వామి దర్శనం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు. చంద్ర, లోకనాథ్ లు పాల్గొన్నారు.

# అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటర్‌గా గుర్తింపు : తహశీల్దారు



పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న తహసీల్దారు ధోని ఆల్ఫ్రెడ్

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** 18 సంవత్సరాలు నిండి ఉన్న ప్రతి పౌరుడికి ఓటర్ గా గుర్తించి నమోదు చేయాలని బండి ఆత్మకూరు తహసీల్దారు ధోని ఆల్ఫ్రెడ్ బిఎల్ఓ లకు సూచించారు. బండి ఆత్మకూరు మండల వ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బండి ఆత్మకూరు ప్రభుత్వ కళాశాల, జడ్పీహెచ్ స్కూల్ తొ పాటు , ఏ కోడూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఉదయం నుండి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాల్లో ఉండి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు.నూతన ఓటర్ నమోదు తో పాటు,మార్పులు చేర్పులకు అవకాశం కల్పిస్తున్నామని ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం ప్రభుత్వ కళాశాల లో నూతన ఓటర్ నమోదు కోసం విద్యార్థుల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో విఆర్ఓ లు రాజు, యేసుపాదం, నాగేశ్వరయ్య, బి ఎల్ ఓ లు జిక్రియా, మేఘాశ్యామ్ ఆచారి, చక్రధర్, రుక్సాన తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను ఆదరించిన పార్టీలకే ప్రజలు పట్టం కట్టారు

- **కర్నూలులో బీసీల సింహగర్జన సభ విజయవంతం**
- **జాతీయ బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా నాగేశ్వరరావుయాదవ్ ఎంపిక**



మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడును సన్మానిస్తున్న మంత్రి సవిత, నాగేశ్వరరావు యాదవ్

**ఆలూరు, మేజర్‌న్యూస్:** కర్నూల్ లో రాష్ట్ర గొర్రెల సంఘం మాజీ చైర్మన్, జాతీయ బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వర రావు యాదవ్ అధ్యర్యంలో నిర్వహించిన బిసి ల సింహగర్జన సభకు ముఖ్య అథితులుగా రాష్ట్ర బిసి సంకేమ శాఖ మంత్రి సవిత,జాతీయ బిసి సంఘం అధ్యక్షులు మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎంపి నాగరాజు,కురువ కార్పొరేషన్ అధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప,శాలివాహన సంఘం అధ్యక్షులు తుగ్గలి నాగేంద్ర లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వాల్మికి కార్పొరేషన్ చైర్మెన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ భర్త మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు పాల్గొనగా వారికి శాలువా కప్పి పూలమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలు ఐక్యమత్యంతో ఉండాలని చట్టసభల్లో వారికి రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.మంత్రి సవిత మాట్లాడుతూ రానున్న రోజుల్లో బిసిలదే రాజ్యాధికారం అని రాష్టంలో అత్యధిక జనాభా బిసి లదే అన్నారు. బీసీలను కేవలం కరివేపాకులా వాడుకుంటున్నారని ప్రతి బిసి నేత రాజకీయ,ఆర్థిక రంగాల్లో రాణించాలని అన్నారు.కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# 'మహిళల రక్షణకు ఉచిత న్యాయ సేవలు'

### - మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** మహిళల రక్షణ కోసం న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సేవలు అందిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా సేవాధికార సంస్థ చైర్మన్ జి కబర్ది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి లీలావెంకటశేషాద్రి, ఆంధ్రప్రదేశ్ జాతీయ మహిళాకమిషన్ మెంబర్ డాక్టర్ రోఖయ బేగం అన్నారు.శనివారం మండల కేంద్రంలోని స్థానిక పొదుపు మండల సమాఖ్య భవన కార్యాలయంలో జాతీయ మహిళల కమిషన్ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా సేవాధికార సంస్థ చైర్మన్ జి కబర్ది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి లీలావెంకటశేషాద్రి, ఆంధ్రప్రదేశ్ జాతీయ మహిళాకమిషన్ మెంబర్ డాక్టర్ రోఖయ బేగం, న్యాయవాదులు రిసోర్స్ పర్సన్ లు మనోహర్, హేమలత, పొదుపు మహిళా సమాఖ్య గౌరవ సలహాదారులు విజయభారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను అమలు చేస్తున్నాయని, మహిళలు చట్టాలను అవగతం చేసుకోవాలని సూచించారు.మహిళలకు సంబంధించిన గృహహింస చట్టం, వరకట్న నిషేధం, బాల్య వివాహాల నిర్మూలన చట్టం, ఫోక్సొ చట్టం, కుటుంబ తగాదాల చట్టాలపై అవగాహన కల్పించారు.ఓర్వకల్లు పొదుపు మహిళలు ఆర్థిక రంగంలో చైతన్యవంతులయ్యారని అదేవిధంగా మహిళల చట్టాలపై అవగాహన పెంచుకొని గ్రామాలలోని మహిళలందరికీ అవగాహన కల్పించి చైతన్యవంతులని చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, కర్నూల్ రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్, ఓర్వకల్లు సిడిపిఓ అనురాధ, ఏపిఎం వెంకట్రామిరెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్లు పొదుపు మహిళలు పాల్గొన్నారు.



# మహారాష్ట్రలో పనిచేసిన పవన్ కళ్యాణ్ మంత్రం..ఇరిగెల



**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విజయం సాధించడంలో జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారని ఆళ్లగడ్డ జనసేన ఇంచార్జ్ ఇరిగెల రాంపుల్లారెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్డీఏ కూటమిని ప్రజలు ఆదరిస్తున్నారని ఇది ఒక ఉదాహరణ అన్నారు. రాబోయే కాలంలో కేంద్ర రాష్ట్ర రాజకీయాల్లో జనసేన కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్రంలో కూడా జనసేన పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారని అలాగే ఆళ్లగడ్డ తాలూకాలో జనసేన పార్టీని ఒక బలమైన శక్తిగా తయారు చేస్తామన్నారు. తాలూకాలో 5200 సభ్యత్వాలను నమోదు చేయడం జరిగిందన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లవలసిన బాధ్యత జన సైనికులు,వీర మహిళల మీద ఉందన్నారు. ఈ సమావేశంలో తాలుక జనసేన అధికార ప్రతినిధి ఇరిగెలసూర్యనారాయణరెడ్డి, మిద్దె రాంపుల్లయ్య, డాలు రత్నమయ్య, మహబూబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానం పై అవగాహన అవసరం



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** అవయవ దానం పై ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేము సైతం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దయాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీవించి ఉన్నంత కాలం ప్రతి అవయవంతో మనిషి జీవనం సాగుతుందన్నారు. మనిషి మృతి చెందిన తర్వాత అవయవాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయన్నారు. దీనివల్ల ఎలాంటి ఉపయోగం లేదని, నేడు కళ్ళు లేనివారు, అలాగే అనారోగ్యాలకు గురై సరైన సమయంకుఅవయవాలు అందక మరణాలు సంభవిస్తున్నాయి. రక్తదానంతో పాటు అవయవ దానం కూడా ప్రతి ఒక్కరు పరిపాటిగా పాటించాల్సిన అవసరంఎంతైనాఉందన్నారు. 1954లో మొట్టమొదటి సారిగా డాక్టర్ జోసఫ్ ముర్రే అనే వ్యక్తి అవయవ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతం చేశారనిరొనాల్డ్ లీహెరిక్ అనేవ్యక్తి తన మూత్రపిండను తన కవల సోదరుడికి ఇచ్చారని అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా వైద్య విజ్ఞానం అభివృద్ధి చెంది అవయవాల మార్పిడి చేపట్టని తెలిపారు. జాతీయఅవయవదాన దినోత్సవాన్ని ప్రతి ఏడాది ఆగస్టు 13వ తేదీన జరుపుతున్నారని చెప్పారు. ఎమ్మిగనూరు పట్టణంలోని వ్యాపారస్తులైన కాసుల రాము శెట్టి , సి. రాఘవేంద్ర శెట్టిలు అవయవ దానంకు అంగీకరించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం అవయవ దాతలకు అంగీకర పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు లక్ష్మణ్ సాగర్, నరసింహులు పాల్గొన్నారు.

# రైతులు పంటల భీమా చేయించుకోవాలి

**– విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగారెడ్డి**



ఇన్సురెన్స్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** గ్రామంలోని రైతులందరూ తాము సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా పంట భీమా చేయించుకోవాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెట్ రంగారెడ్డి కోరారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ, మినుము, వరి, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలు సాగు చేసిన పంటలకు భీమా వర్తిస్తుందని రైతులందరూ ప్రీమియం చెల్లించాలన్నారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో పంటల నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సాగు చేసిన కంది, శనగ పంటల్లో వచ్చే తెగుళ్ల గురించి వాటి నివారణ గురించి రైతులకు తెలియజేశారు. రైతులు పంటల భీమా ప్రీమియం శనగ ఒక ఎకరాకు 84 రూపాయలు, వరికి 126 రూపాయలు, జొన్నకు 59 రూపాయలు, మినుముకు 48 రూపాయల ప్రకారం ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలి



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు ఆకాంక్షించారు. శనివారం కర్నూలు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్రీడాదుస్తుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా క్రీడాకారులు క్రమశిక్షణతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని స్నేహభావాన్ని పెంపొందింకొని విజేతలుగా తిరిగి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యోగ సంఘం కార్యదర్శి అవినాష్‌శెట్టి, కర్నూలు జిల్లా షూటింగ్ బాల్‌సంఘం కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.

# ఛలో కలెక్టరేట్ ధర్నాలను జయప్రదం చేయండి

**ఏపి అంగన్‌వాడి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.లలిత**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** ఈనెల 26వ తేది జరిగే దేశవ్యాప్త పిలుపులో భాగంగా అఖిలపక్ష సంయుక్త కార్మిక సంఘాల ఛలో కలెక్టరేట్ ధర్నాలను జయప్రదం చేయాలని ఏపి అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొనే అంగన్‌వాడివర్కర్లకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ శనివారం కర్నూలు జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం సమర్పించారు. సందర్భంగా జె.లలిత మాట్లాడుతూ అంగన్‌వాడివర్కర్స్, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రాష్ట్ర వ్యాప్త అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్‌కి గ్రాడ్యుడిటి అమలు చేయాలని, మినీ వర్కర్లందర్నీ మెయిన్ వర్కర్‌గా గుర్తించాలని, విధులలో చనిపోయిన వారికి రూ.5లక్షలు, ఇంటిలో ఒకరికి ఉద్యోగం, మట్టి ఖర్చులకు రూ.20వేలు ఇవ్వాలని కోరారు. కావున ఈనెల 26వ తేదిన నిర్వహించే ధర్నాలో జిల్లాలోని అంగన్‌వాడి వర్కర్లు హెల్పర్లను అంగన్‌వాడి కేంద్రాలలో ఉంచి, ఆదోని, ఎమ్మిగనూరు, అస్పరి, ఆలూరు, మంత్రాలయం వర్కర్లందరూ ఆదోని ఆర్‌డిఓ కార్యాలయం నందు జరిగే ధర్నాలో పాల్గొనాలని, కర్నూలు, వెల్దుర్తి, కోడుమూడు అంగన్‌వాడి వర్కర్లంతా కర్నూలు కలెక్టరేట్ ధర్నాలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.



అధికారిణికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకురాలు జె.లలిత

# విద్యార్థులకు భూమా కుటుంబం అండ



ర్యాంకు సాధించిన యశ్వంత్ బాబును అభినందిస్తున్న భార్గవరామ్

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకునే విద్యార్థులకు భూమా కుటుంబం అండగా ఉంటుందని తాలుకా టిడిపి సీనియర్ నాయకులు భార్గవరామ్ అన్నారు. దొర్నిపాడు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన గడ్డిపాటి యశ్వంత్ కుమార్ ఎయిర్పోర్ట్ ఆఫ్ ఇండియా చెన్నైలో పనిచేస్తూ ఐ ఈ ఎస్ పరీక్ష రాసి ఇండియాలోనే 18వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా యశ్వంత్ కుమార్‌ను భార్గవరామ్ శనివారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకునే విద్యార్థులకు భూమా కుటుంబం అండగా ఉంటుందని యశ్వంత్ కుమార్ ఉన్నత స్థాయికి చేరుకుని ఆళ్లగడ్డ పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాలన్నారు.

# టిడిపి నాయకుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న టిడిపి నాయకులు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** చాగలమర్రి పట్టణం లోని భవాని నగర్‌లో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌భాష,నాలుగవ ఎంపిటిసి ఇంచార్జి జెట్టి నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు శనివారం శ్రమదానం చేసారు. ఈ సందర్భంగా భవానినగర్‌లో రోడ్డు మట్టిని చదును చేసి గుంతలను పూడ్చారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో పట్టణంలోని పలు వీధుల్లో సిసిరోడ్లు,మురికి కాలువల నిర్మాణాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి హుసేన్ వళి,హనీఫ్,ఖలీల్,రాజేంద్ర,టైలర్ ఖాదర్, నరసింహా,జెట్టి సురేష్,బారిక్‌చామల్ మాబాష,ఫరూఖ్,ఇర్షాద్,నూర్‌భాష పాల్గొన్నారు.

## ఉచిత ఎం.ఎం.ఆర్ వ్యాక్సిన్ శిబిరాన్ని ప్రారంభించిన బి.సి ఇందిరమ్మ



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ మరియు శ్రీ కాత్యాయని మెడికల్స్ మరియు సర్జికల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎం.ఎం.ఆర్ వ్యాక్సిన్ మెగా శిబిరం మరియు ఉచిత చిన్న పిల్లల వైద్య శిబిరాన్ని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ హాజరై ప్రారంభించారు.

## బీసీ శంఖారావం వనభోజన మహోత్సవానికి తరలిన బీసి నాయకులు



తరలివెళ్తున్న ప్యాపిలి మండల బీసి నాయకులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** కర్నూలు నగరంలో శనివారం నిర్వహించిన బీసి శంఖారావం వనభోజన మహోత్సవ రాష్ట్ర మహాసభల కార్యక్రమానికి ప్యాపిలి మండల బీసి నాయకులు రాష్ట్ర బీసి సంక్షేమ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావుయాదవ్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో బీసి నాయకులు గొల్ల రామ్మోహన్‌యాదవ్, సింగిల్‌విండో మాజీ ఉపాధ్యక్షులు నడిగడ్డ నాగేంద్ర, కోదండరామయ్యయాదవ్, నరేంద్రయాదవ్, బీసి నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ విజయోత్సవ సంబరాలు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఏ మహాయుతి కూటమి అత్యధిక స్థానాలు గెలుపొందడంపై డోన్ బీజేపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం స్థానిక పాతబస్టాండ్ సమైక్యాంధ్ర కట్ట దగ్గర బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచి నరేంద్రమోది జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపి కోఆర్డినేటర్ వడ్డె మహరాజ్ ప్రధానమంత్రి మోది నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వగురువుగా ఎదగడంలో మరాఠి ప్రజలు కీలకపాత్ర పోషిస్తున్నారని వారి కృషి వల్లే మహరాష్ట్రలో బీజేపి బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిందని, ఇండి కూటమి నేతలు ఎన్ని కుట్రలు చేసినా చివరకు తమ పార్టీ విజయం సాధించిందన్నారు. ఈ విజయానికి కృషి చేసిన మరాఠి ప్రజలకు, ఓటర్లకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్మీ రామయ్య, పట్టణ కోఆర్డినేటర్ కోడి అశోక్, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుకు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు నాగార్జున, ఎస్‌సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు భరణి రమేష్, అరబోలు వీరేష్, ఆచారి, గోసానిపల్లె రాజా తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయండి



పోలీస్ అధికారులతో సమావేశమైన జిల్లా జడ్జి

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని ఐదవ అదనపు జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు ఆర్‌వివిఎస్ మురళీకృష్ణ అన్నారు. శనివారం కోర్టు ఆవరణంలో ఆయన పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను కచ్చిదారులందరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఆళ్లగడ్డ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ అధికారులతో లోక్ అదాలత్ ద్వారా రాజీకి అర్హమైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ అర్హమైన అన్ని క్రిమినల్ కేసులను మరియు సివిల్ తగాదాలను జాతీయాల్లో అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఆళ్లగడ్డ కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి అన్నారు. ఈ సమావేశంలో ఏపీపీ సోమశేఖర్ రెడ్డి, సుబ్బయ్య, గోపాలకృష్ణ , సిఐలు చిరంజీవి, కంబగిరి రాముడు, ఎస్సైలు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహాశీల్దార్ శ్రీనివాస రెడ్డి



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహాశీల్దార్ శ్రీనివాస రెడ్డి

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :**

మండల పరిధిలోని మారందొడ్డి గ్రామంలో శనివారం పోలింగ్ బూత్ 187,188లను పరిశీలించారు. ప్రతేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం రీసర్వే డి.టి.వెంకటేశ్వర్లుతో కలసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటరు నమోదు కార్యక్రమంలో వచ్చిన మొత్తం 21 దరఖాస్తులకుగాను కొత్త ఓటరు నమోదు దరఖాస్తులు 7,వివిధ కారణాలతో తొలగింపు కొరకుదరఖాస్తులు6,బదిలీకొరకు దరఖాస్తులు 8 వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు.

## ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేసిన ఆర్డిఓ

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** స్థానిక ఎద్దుల పాపమ్మ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బిఎల్ ఓలకు పలు సూచనలు చేశారు. 134 ఆళ్లగడ్డ నియోజ కవర్గ పరిధిలో 298 పోలింగ్ స్టేషన్లు ఉండగా ఫారం -6కు సంబంధించి పురుషులు 73, స్రీలు 40 అలాగే ఫారం-7కు సంబంధించి పురుషులు 6, స్త్రీలు 6, ఫారం-8కు సంబంధించి పురుషులు 19, స్త్రీలు 22 మొత్తం అన్ని కలిపి 166 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.



సూచనలు ఇస్తున్న ఆర్డిఓ విశ్వనాథ్

## నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

**బండిఆత్మకూరు , మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆల్ఫ్రేడ్ పేర్కొన్నారు. శనివారం బండిఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వండించిన పాయసాన్ని, కర్వేపాకు అన్నంను తిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. పాఠశాలలో ఉన్న వంట గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తాను మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ తనిఖీ చేస్తామని తెలిపారు. ఎక్కడైనా నాణ్యతలేని భోజనం అందిస్తే వారిపైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి యశోధ, ఇన్‌చార్జ్ హెచ్ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, వీఆర్వోలు యేసుపాదం, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు దాటిన వారికి ఓటు హక్కును కల్పించండి

**డోన్ ఆర్‌డిఓ నరసింహులు**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః**

18 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించే విధంగా బూత్ లెవల్ అధికారులు చర్యలు తీసుకోవాలని డోన్ ఆర్‌డిఓ నరసింహులు పేర్కొన్నారు. కేంద్ర ఎలక్షన్ కమీషన్ వారి ఆదేశాల మేరకు శనివారం స్పెషల్ క్యాంపెయిన్ డేను పురస్కరించుకొని శనివారం డోన్ ఆర్‌డిఓ నరసింహులు ప్యాపిలి గ్రామంలోని బీసికాలనీ, బాలుర పాఠశాల, కిందిగేరి స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బిఎల్ఓలతో మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి, వారికి ఓటు హక్కు కలిగే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట తహశిల్దార్ భారతి, ఆర్ఐ సునీతబాయి, సిబ్బంది ఉన్నారు.

## భూమా అఖిలప్రియ ఎన్నిక పట్ల తెలుగు తమ్ముళ్ల సంబరాలు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ నియోజకవర్గ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ రాష్ట్ర అంచనాల కమిటీలో సభ్యులుగా ఎన్నిక కావడం పట్ల స్థానిక తెలుగు తమ్ముళ్లు సంబరాలు జరుపుకున్నారు. శనివారం స్థానిక న్యూ బిల్డింగ్స్ లోని టిడిపి కార్యాలయం లో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్‌అన్సర్ భాష ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు కేక్ కోసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టించి పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుంది అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తున్న భూమా అఖిలప్రియకు పదవి రావడం శుభపరిణామం అన్నారు. దీంతో ఆళ్లగడ్డను మరింత అభివృద్ధి చేసేందుకు ఈ పదవి తోడ్పాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి



కేక్ కోసి సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

హుస్సేన్ వల్లి, జెట్టి నాగరాజు, హనీఫ్, బజాజ్ షోరూం ఫారూఖ్, టైలర్ ఖాదర్,రాజేంద్ర, నాగూర్, బారిక్ చామల్‌మాభాష, హ్యాపీ, జెట్టి కుమార్ ,సురేష్, జెట్టి సాయి, సంజీవ రాయుడు,మాబుపీరా తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలలో ఉత్తమమైన ఫలితాలు సాధించాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థినీలు ఉత్తమమైన ఫలితాలు సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మాగాంధీజ్యోతిబాపూలే బీసి బాలికల గురుకుల పాఠశాలను జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలకు వడ్డించే భోజనాన్ని ఆమె పరిశీలించి, విద్యార్థినీలకు నాణ్యమైన పోషకాలు కలిగి ఉన్న భోజనాన్ని వడ్డించాలని మిడ్‌డే



విద్యార్థినీలకు ప్రశ్నలు అడుగుతున్న జేసి బి.నవ్య

మీల్స్ నిర్వహకులకు ఆదేశించారు. అనంతరం ఆమె పదవ తరగతి విద్యార్థినీలకు పాఠ్యాంశంలోని పాఠాలకు చెందిన ప్రశ్నలు వేశారు. అందుకు విద్యార్థినీలు కూడా ఆమె ప్రశ్నలకు సరైన సమాధానాలిచ్చారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. పదవ తరగతి పరీక్షల్లో ఏ గ్రేడ్ ర్యాంక్‌లు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అలాగే ప్రస్తుతం శీతాకాలం కావున విద్యార్థినీలకు దుప్పట్లు, బెడ్‌షీట్లు అందించాలని ప్రిన్సిపాల్ ఎం.షబానాబేగంకు ఆదేశించారు. ఆమె వెంట బీసి వెల్ఫేర్ అధికారిణీ వెంకటలక్ష్మి, పత్తికొండ ఆర్‌డిఓ సంజీవ్‌కుమార్, వెల్దుర్తి తహశిల్దార్ చంద్రశేఖర్‌వర్మ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా పుట్టపర్తి సాయిబాబా 99వ జన్మదిన వేడుకలు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు శనివారం పుట్టపర్తి సాయిబాబా 99వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జీవి.రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు, పుట్టపర్తి సాయిబాబా భక్తులు ప్రముఖ పారిశ్రామికవేత్త తిరివీధి సాయిప్రసాద్, శ్రీవిద్యానికేతన్ సంస్థల అధ్యక్షులు జి.రమణాచలం, సురేష్‌యాదవ్, పోస్టల్ సాయి, శ్రీశారద విద్యానికేతన్ కరస్పాండెంట్ జలప్రతాప్, సుంకన్న, హెచ్ఎం గఫూర్, ఏఓ ప్రభాకర్‌రాజు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల సమక్షంలో పుట్టపర్తి సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయిప్రసాద్ మాట్లాడుతూ పుట్టపర్తి సాయిబాబా లవ్ ఆల్....సర్వ్ ఆల్ అనే నినాదంతో భక్తులను దైవమార్గంలో మరల్చారని, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, పుట్టపర్తి సాయిబాబా విద్యా సంస్థలు, హాస్పిటల్స్, రాయలసీమకు నీటి ప్రాజెక్టుల కొరకు ఎంతో ఆర్థిక సహాయం చేశారని, ఆయన ఉపన్యాసాల ద్వారా 180 దేశాలలో భక్తులను కలిగి ఉన్నారని,



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం, అతిథులు

బాబా సేవల ద్వారా ప్రపంచ స్థాయి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం రమణాచలం మాట్లాడుతూ పిల్లలకు చక్కని కథలతో రజింపచేసి, ప్రతి ఒక్కరూ బాబా మార్గాన్ని అనుసరించి, సన్మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. అనంతరం మంగళహారతి ఇచ్చి, విద్యార్థులకు ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ముఖ్య అతిథులు, హెచ్ఎంలు, కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీల్లో ఉర్దూ స్కూల్ విద్యార్థులకు కాంస్య పతకాలు



విద్యార్థినిలను అభినందిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** జిల్లాస్థాయి అటియాపాటియా పోటీలలో ప్రభుత్వ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కాంస్య పతకం సాధించారు. నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా అటియా పాటియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ప్రభుత్వ ఉర్దూ బాలికల పాఠశాల విద్యార్థినిలు కాంస్య పతకం సాధించడం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం పుష్పరాజ్ అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పాఠశాలకు పేరు, ప్రఖ్యాతలు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ కృషిని ప్రశంసించారు. కాంస్య పతకం సాధించిన తస్లీమ్, అజీమా, నుస్రత్సానియా, హసీనా, ముల్లాసన, బషీర్‌భాను, నస్రిన్, నాజియా, యాస్మిన్, నిలోఫర్, జహరాలను అభినంఆదించారు.

## పాఠశాలను తనిఖీ చేసిన మండల నోడల్ అధికారి శ్యామల

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** మండలంలో ఉన్నత పాఠశాలను శనివారం ఎంపిడిఓతో కలసి నోడల్ అధికారి శ్యామల తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులు సంఖ్యను అడిగి తెలుకున్నారు. అనంతరం స్టోర్ రూం, వంటగది పరిశీలించి స్టోర్ రూం కుప్పలుగా పడివున్న బుక్స్, స్కూల్ యూనిఫాం, తో పాటు ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారం గురించి ఆరా తీశారు. క్రమ బద్ధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు మెనూప్రకారం ఆహారం అందించాలన్నారు. అనంతరం మండలంలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం నందు మండల స్థాయి అధికారులతో పలు అభివృద్ధి పనులపై అరా తీశారు. ప్రతి ఒక్క అధికారి వారి విధులను సక్రమంగా నిర్వహించి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి, ఎంపిడిఓ రాణెమ్మ, ఈఓఆర్డి, పశు వైద్యాధికారి, విద్యాశాఖాధికారి, ఉపాధి హామీ ఏపీఓ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యారులతో కలసి మధ్యాహ్నం భోజనం చేస్తున్నా మండల నోడల్ అధికారి శ్యామల

సూర్య



# డిసెంబర్ 7న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం

- పూర్వపు విద్యార్థుల సహకారం తీసుకోవాలి
- కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్** :డిసెంబర్ 7వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహించేందుకు చక్కటి ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంఈఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ యాక్షన్ ప్లాన్‌పై దిశా నిర్దేశం చేశారు. డీఈఓ జనార్ధన్‌రెడ్డి, సమగ్ర శిక్షణ అభియాన్ అధికారి లలిత తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి షెడ్యూల్ విడుదల చేసిందని ఈమేరకు అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించేందుకు చక్కటి ప్రణాళిక



విద్యాశాఖాధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

రూపొందించుకోవాలని ఎంఈఓలు, హెడ్మాస్టర్లను ఆదేశించారు. ఫ్లెక్సీపై ఎలాంటి ఫోటోలు లేకుండా కేవలం పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు అనే నినాదంతో తయారు చేసి వేదికపై ప్రదర్శించాలన్నారు. అతిథులను వేదికపైకి ఆహ్వానించి బొకేలు ఇవ్వకుండా కేవలం రెండు లేదా మూడు పుష్పాలను మాత్రమే అందించి స్వాగతం పలకాలన్నారు. ఆహ్వాన పత్రికలు ప్రతి పేరెంట్‌కు అందజేయడంతో పాటు ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వపు విద్యార్థులకు ఖచ్చితంగా చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వహణకు అవసరమయ్యే బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని అనవసరపు ఖర్చు చేయకుండా సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. తరగతి గదులలోని బోర్డులపై చక్కటి కొటేషన్లు విద్యార్థులచే రాయించాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే ఉపన్యాసాంశాలు మాత్రమే ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే సమావేశాలకు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానితులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనంతో పాటు అదనపు ఆహార పదార్థాలను జోడించి శుభదిన్ భోజనం ఏర్పాటు చేయాలన్నారు. కేటాయించిన బడ్జెట్‌కు అదనంగా దాతల సహకారం తీసుకుని పేరెంట్ కమిటీ సమావేశాలను నిర్వహించాలన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కార్యక్రమాలు జరిపి మెగా పేరెంట్ కమిటీ మీటింగ్‌ను విజయవంతం చేయాలన్నారు.

### సామాజిక భద్రత పింఛన్ పంపిణీపై
# రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా సామాజిక భద్రతలు పింఛన్లు పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నూతన మార్గదర్శకాలు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష తెలిపారు. ఈ మార్గదర్శకాల ప్రకారం పెన్షన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మరణిసేత వెంటనే అతని భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయడం జరుగుతోందన్నారు. కుటుంబ యజమాని మరణించిన వెంటనే అందకు


మాట్లాడుతున్న పి.రంజిత్‌బాష

సంబంధించి తగిన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేస్తే తదుపరి నెల అతని భార్యకు పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. 01.11.2024 తర్వాత మరణించిన వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. ఒకటి, రెండు నెలల్లో పింఛన్ తీసుకోకపోయినా మూడు నెలలకు కలిపి పింఛన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకోకపోతే పెన్షన్ నిలిపివేయడం జరుగుతుందన్నారు.

### క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని
# అలవర్చుకోవాలి : డోన్ డిఎస్‌పి



బ్యాడ్మింటన్ కిట్లను అందించిన డిఎస్‌పి శ్రీనివాసులు

**డోన్, మేజర్‌న్యూస్ః** నేటి తరం విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవనవిధానాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవడం జరుగుతుందని డోన్ డిఎస్‌పి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం డోన్ డిఎస్‌పి శ్రీనివాసులు సందర్శించారు. అనంతరం హెచ్‌ఎం బి.చంద్రశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజాన్ని పీడిస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాలు, బాలబాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని, చెడు వ్యసనాలకు, దురలవాట్లకు విద్యార్థినీ, విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే విద్యతోపాటు క్రీడారంగంలో కూడా అత్యున్నత ప్రతిభను కనబరచాలని, అప్పుడే ఉత్తమమైన బంగారు భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్ క్రీను సైతం ప్రోత్సహించే విధంగా పాఠశాలకు క్రీడా సామాగ్రిని అందించారు. అదేవిధంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సుధాకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డోన్ డిఎస్‌పి శ్రీనివాసులును పాఠశాల ఉపాధ్యాయ బృందం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖులు

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో ఇరువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. శనివారం ఆరోగ్య శాఖ హెల్త్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గణపతి రావు, ఐపీఎం ఫుడ్‌సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీజనలు పూజలు నిర్వహించారు. సాదారణ భక్తులుగా క్షేత్రానికి వచ్చి శ్రీ కామేశ్వరీసమేత మహానందీశ్వర స్వామివార్లకు అభిషేక అర్చనలు నిర్వహించారు. యాగశాలలో వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందించి దుశ్శాలువలతో సత్కరించారు. వీరి వెంట ఎంపీహెచ్‌ఈవో జగదీశ్వరప్ప, ఫార్మసిస్టు చంద్రశేఖర్, ఆయూష్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.


మహానంది క్షేత్రంలో పూజలు నిర్వహించి వస్తున్న గణపతి రావు

### అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయంలో
# కార్తీక దీపోత్సవం


ఆంజనేయస్వామి విశేషంగా పూజలు చేసిన దృశ్యం

**హొళగుంద, మేజర్‌న్యూస్ :** హొళగుందకు కిలో మీటర్ దూరంలో ఉన్న అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయంలో కార్తీకమాసం మూడవ శనివారం సందర్భంగా దీపోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆంజనేయస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై దీపాలను వెలగించారు. ఆంజనేయ స్వామి వారికి అర్చకులు విశేషంగా పూజలు చేశారు. ప్రాంగణంలో శ్రీ ఆంజనేయ స్వామి, ఓం,త్రిశూలం, స్వస్తిక్, ఈశ్వర వివిధ ఆకృతితో అలమరిచిన దీపాలను భక్తులు భక్తి శ్రద్ధలతో వెలిగించారు. చిన్న, పిల్లలు, పెద్దలు దీపాలను వెలిగించారు. జై శ్రీరామ్.. జై ఆంజనేయస్వామి.. అంటు భక్తులు నినాదాలతో దీపాలను వెలిగించారు. దీపాల కాంతులతో దేవాలయ ప్రాంగణం శోభిల్లింది. దీపోత్సవ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదం అందించారు.


దీపాలను వెలగిస్తున్న చిన్నారీ


వివిధ ఆకృతి దీపాలను వెలిగించిన భక్తులు

# సమస్యల పరిష్కారానికి చర్యలు

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** వివిధ కాలనీల్లో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం కమిషనర్ అధికారులతో కలిసి కల్లూరు ఎస్టేట్‌లో పర్యటించారు. కాలనీలో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణంలో రహదారి గుంతలమయంగా మారిందని కమిషనర్ దృష్టికి తీసుకెల్లారు. తాగునీటి సరఫరా మెరుగుపరచరాలని, మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ క్రిష్ణలత, ఏఈలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భానుప్రతాప్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న కమిషనర్

# వెగా జ్యువెలర్స్‌ను ప్రారంభించిన ఎన్‌ఎండి ఫిరోజ్



వెగా జ్యువెలర్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎన్‌ఎండి ఫిరోజ్

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన వెగా జ్యువెలర్స్ ఎగ్జిబిషన్ మేనేజర్ బాలు ఆహ్వానం మేరకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ముఖ్య అతిథిగా పాల్గొని వెగా జ్యువెలర్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాలలో వెడ్డింగ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ కం సేల్ జరుగుతుందని నంద్యాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 23,24లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ నాగార్జున, కామిని మల్లికార్జున, ఇసుక చాంద్, కాజా, భాస్కర్, వేదసాయి, మహబూబ్‌బాషా సుధాకర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

# రూ.కోటి నిధులు కేటాయించిన కర్నూలు ఎంపీ

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మతులకు తన ఎంపీ నిధుల నుంచి రూ.కోటి కేటాయిస్తున్నట్లు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. నగరంలోని ఎంపీ కార్యాలయాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు ఈ ప్రకటన చేశారు. దీనిపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు మంత్రి సవితను ఎంపీ నాగరాజు శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.


మంత్రి సవితను సన్మానిస్తున్న దృశ్యం

# వెల్దుర్తిలో లక్ష దీపోత్సవం

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ :** కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కార్తీక దామోదర లక్ష దిపోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 25వ తేది సోమవారం సాయంత్రం 6ః00గంటలకు ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపిపి, టిడిపి సీనియర్ నాయకులు ఎల్ఈ.జ్ఞానేశ్వర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని బాలుర జడ్పిహెచ్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించే లక్ష దీపోత్సవ కార్యక్రమానికి మండలంలోని మహిళలు పెద్ద ఎత్తున హజరుకావాలన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటి సిఎం కేఈ.కృష్ణమూర్తి, మాజీ మంత్రివర్యులు కేఈ.ప్రభాకర్, పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబులు ముఖ్య అతిథులుగా హజరౌతారన్నారు. అలాగే లక్ష దీపోత్సవ కార్యక్రమానికి తరలివచ్చే భక్తులందరికీ అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.